అంబర్‌పేట బోనాలకు
సర్వం సిద్ధం

1950 నుంచి గ్రామదేవతగా అలరారుతున్న అంబర్‌పేట మహంకాళి అమ్మవారు





- నగరంలో ప్రతిష్టాత్మకంగా జరిగే బోనాల వేడుకల్లో అంబర్‌పేట ఒకటి
- వచ్చే ఆదివారం జాతరకు అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

అంబర్‌పేట: బోనాల జాతర సందడి ప్రారంభమైంది. అంబర్‌పేట నియోజకవర్గంలో మహంకాళి ఆలయం వద్ద ప్రతిష్టాత్మకంగా నిర్వహించే వేడుకలకు సర్వం సిద్ధమయ్యింది. పక్కా గ్రామీణ వాతావరణాన్ని తలపించే బోనాల జాతర అంబర్‌పేటలో ఘనంగా జరుగుతుంది. నగరంలో ప్రతిష్టాత్మకంగా జరిగే బోనాల ఉత్సవాల్లో అంబర్‌పేట మహంకాళి ఆలయం ఒకటి. ఏడు దశాబ్దాల చరిత్ర ఉన్న మహంకాళి ఆలయ బోనాల వేడుకలు వైభవంగా జరుగుతాయి. 1948లో అంబర్‌పేట ఒక పెద్ద గ్రామం ఆరోజుల్లో ఇక్కడి ప్రాంత ప్రజలు అంటువ్యాధుల బారిన పడి ఆందోళన చెందుతున్నారు. దీంతో గ్రామ పెద్దలు మహంకాళి అమ్మవారిని ప్రతిష్ఠించి బోనాల జాతరను నిర్వహించి గ్రామ ప్రజలను రక్షించాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ ఉత్సవాల కోసం అంబర్‌పేట దేవాస్థాన సేవా సమితిని 1950లో స్థాపించి ప్రతి ఏటా ఉత్సవాలను ఇప్పటివరకు నిర్వహిస్తు వస్తున్నారు. సింహ వాహినపై అమ్మవారి తల ఏడమ వైపు ఉండడం ఇక్కడి అమ్మవారి ప్రత్యేకత ఖడ్గ దారనీ అయి, రక్త పాత్ర చేతబూని దర్మసంరక్షణ కోసం అవతరించారంటు ప్రతిజ్ఞా చేస్తున్నట్లు భక్తులకు దర్శనిమిస్తారు. అప్పటి నుంచి అమ్మవారికి వైభవంగా బోనాల జాతర నిర్వహించుకుంటు వస్తున్నారు.

2004లో ఆలయానికి కొత్త రూపు..

2004 వరకు చిన్న ఆలయంలో గ్రామ రక్షణ దేవతగా ఉన్న అమ్మవారికి ప్రతిష్టాత్మకంగా ఆలయాన్ని నిర్మించేందుకు దేవస్థాన సేవా సమితి నిర్ణయించారు. అప్పటి ఆలయ కమిటీ చైర్మన్ కె. దుర్గాప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో వ్యయ ప్రయాసలకోర్చి ఆలయాన్ని విశాలంగా, సర్వంగా సుందరంగా నిర్మించారు. ఈ ఏడాది 54 ఫీట్ల నూతన గజాస్తంభాన్ని పునఃప్రతిష్ఠించారు.



అంబర్‌పేట ఆలయం వద్ద ధ్వజ స్తంభాన్ని పునఃప్రతిష్ఠిస్తున్న వేదపండితులు

మన బొట్టు.. మన బోనం..

బోనాల జాతరలో అమ్మవారికి అత్యంత ఇష్టమైంది బోనాం. పండుగరోజున మహిళాలు ప్రత్యేకంగా బోనాం తయారు చేసి డప్పు చప్పుల్లతో బోనాన్ని తీసుకువచ్చి అమ్మవారికి నైవేద్యంగా సమార్పిస్తారు. అమ్మవారికి బోనాంను దాదాపు ప్రతి ఇంటి నుంచి సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

పోతరాజు నృత్యాలు హైలెట్..

సంప్రదాయంగా నృత్యం చేసే పోతరాజులు బోనాల వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ. ఒంటి నిండా పసపు కుంకుమతో ఆలంకరించుకొని వీర గోలలు పట్టుకొని కాళ్లకు గజ్జలు కట్టి చేసే నృత్యాలు తెలంగాణ సంస్కృతి బోనాలకు ప్రతిబింబంగా నిలుస్తాయి. అమ్మవారి ఫలహారం బండ్లు, తొట్టెల ఊరేగింపుకు ముందు పోతరాజుల వీరంగాలతో జరిపించే బోనాల వేడుకలతో ప్రజలు భక్తి పరవశ్యంలో మునిగి పోతారు.

సోమవారం భవిష్యవాణి

ఆదివారం బోనాల సమర్పణ అనంతరం సోమవారం ఆలయం ముందు భవిష్య వాణి కార్యక్రమం అట్టహాసంగా జరుగుతుంది. పచ్చి కుండపై ప్రత్యేకంగా భవిష్యవాణి వినిపిస్తారు. అమ్మవారి ఆశీస్సులు భక్తుల రక్షణ, ప్రకృతి ఆరాధన వంటి అంశాలను భవిష్యవాణిలో వినిపిస్తారు. అమ్మవారి ఫలహారాల బండి ఊరేగింపు చూడముచ్చటగా జరుగుతుంది.



ఆలయం ముందు భవిష్యవాణి వినిపిస్తున్న దృశ్యం (ఫైల్ ఫొటో)

హోంగార్డులకు న్యాయం చేయండి

ముషీరాబాద్: దేశవ్యాప్తంగా పని చేస్తున్న హోంగార్డుల స్థితిగతులను తెలుసుకుని న్యాయం చేయాలని నేషనల్ హోంగార్డ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. హోంశాఖలో 1963 చట్టాన్ని సవరణ చేయలని కోరారు. బుధవారం అసోసియేషన్ చైర్మన్ రాథోడ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పాకాల రాజశేఖర్, వైస్ ప్రెసిడెంట్ కమలాశర్మ ఢిల్లీలో హోమ్ సహాయమంత్రి బండి సంజయ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. వివిధ రాష్ట్రాల్లో 30 సంవత్సరాలకు పైగా హోంగార్డులు పని చేస్తునా పర్మనెంట్ చేయలేదని తెలిపారు. పుదుచేరి రాష్ట్రంలో హోంగార్డులను కాని స్టేబుళ్లుగా ప్రమోట్ చేశారని తెలిపారు. ఇదే విధానాన్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని కోరారు.

స్మితా సబర్వాల్‌ను అరెస్టు చేయాలి

ముషీరాబాద్: దివ్యాంగులపై అనుచిత వాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌ను వెంటనే అరెస్టు చేయాలని అఖిల భారత వికలాంగుల హక్కుల వేదిక జాతీయ అధ్యక్షుడు పులి నాగేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. నగర పోలీసు కమిషనర్ కార్యాలయంలో స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని బుధవారం జాయింట్ కమిషనర్ ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు జంగల్ శ్రీనివాస్, మహిళా నాయకురాలు దయామణి, మాధవి, డేవిడ్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

పండంటి బిడ్డకు జన్మనిచ్చిన బధిర దంపతులు



సాక్షి,సిటీబ్యూరో: బధిర దంపతులైన వినాయక్, శృతకీర్తి ఐవీఎఫ్ ద్వారా ఆడబిడ్డకు జన్మనిచ్చారు. ఎన్నో ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్న వారికి దోమల గూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు సీసీఎంబీలో జన్యు విశ్లేషణ జరిపించి సరైన చికిత్స అందించారు. వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఐవీఎఫ్ ద్వారా పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చేలా కృషి చేశారు. బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో డా. జ్యోతిష్మతి శర్మ వివరాలు వెల్లడించారు.

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రాజీనామా చేయాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ



సమావేశంలో సంఘం నాయకులు ఎర్ర సత్యనారాయణ, గుజ్జ కృష్ణ

కాచిగూడ: పార్లమెంట్‌లో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి, బీసీలకు మరోసారి తీవ్ర అన్యాయయం జరిగిందని బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. బుధవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. రూ.48లక్షల కోట్ల బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.3300 కోట్లు కేటాయించడం దారుణమని అన్నారు. తెలంగాణకు నిధులను తీసుకురావడంలో కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆయన వెంటనే తన మంత్రి పదవికి, పార్లమెంట్ సభ్యత్వానికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉక్కు ప్యాక్టరీ, సింగరేణి విద్యుత్ ప్రాజెక్టులు, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎయిర్ పోర్టులు తదితర అంశాలను పూర్తిగా విస్మరించటానికి తక్షణమే సమాదానం చెప్పాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని డిమాండ్ చేశారు. కిషన్‌రెడ్డి సొంత అంబర్‌పేట నియోజకవర్గంలో ఫ్లై ఓవర్ నిర్మాణం సైతం నిధులు కేటాయించకుండా నిర్మాణపు పనులు నత్తనడకన సాగుతున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నేతలు గుజ్జ కృష్ణ, నీలం వెంకటేష్, వేముల రామకృష్ణ, కోల జనార్ధన్, గోరిగే మల్లేష్ యాదవ్, జిల్లపల్లి అంజి, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

కవాడిగూడ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి అమ్మ రుణం తీర్చుకోవాలని కవాడిగూడ కార్పొరేటర్ జి.రచనశ్రీ అన్నారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం 'మా కే నామ్ పర్ ఏక్ పేడ్'కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బండమైసమ్మనగర్‌లోని కొదండరామస్వామి దేవాలయంలో కార్పొరేటర్ రచనశ్రీ, గంటా సుగుణమ్మతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జి.వెంకటేష్, మహేందర్‌బాబు, ఆలయ కమిటీ సభ్యులు ఆనంద్, చికోటి శ్రీనివాస్, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణకు 69 పతకాలు

కాచిగూడ: రాజస్థాన్, ఉదయపూర్‌లో ఈనెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు జరిగిన 7వ అండర్ వాటర్ ఫిన్ స్విమ్మింగ్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ నుంచి 29 మంది స్విమ్మర్స్ పాల్గొని వివిధ విభాగాల్లో 69 పతకాలను సాధించారు. విజేతలైన స్విమ్మర్స్ మంగళవారం రాత్రి రాజస్థాన్ నుంచి కాచిగూడ, హైదరాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. మెజారిటీ పతకాలు సాధించడం అభినందనీయమని అండర్ వాటర్ ఫిన్ స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దినేష్ రాజోరియా, ఆఫీస్ సెక్రటరీ అంతర్జాతీయ స్విమ్మర్ క్వీన్ విక్టోరియా, స్విమ్మింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి క్రీడాకారులకు ఘనంగా స్వాగతం పలికారు.

'ప్రశ్నించే గొంతుకలపై ఉక్కుపాదం మోపుతున్నారు'



పీఓడబ్ల్యూ రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కమల

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రశ్నించే గొంతుకలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపుతున్నాయని విశ్రాంత ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘం కార్యదర్శి కమల అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పీఓడబ్ల్యూ ఐదు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ... రెండు తెలుగు రాష్ట్రాల్లో మహిళా సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తూ పీఓడబ్ల్యూ వారికి బాసటగా నిలుస్తుందన్నారు. స్త్రీలపై అనేక రూపాలుగా జరుగుతున్న దోపిడీ, వివక్ష, అణచివేత, భౌతిక, ఆర్థిక సామాజిక దాడుల హింస నిరవధికంగా కొనసాగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పీఓడబ్ల్యూ నిరంతరం మహిళలను అప్రమత్తం చేస్తూ వారి సమస్యలపై పోరాడుతుందన్నారు.

◆ ఉమ్మడి రాష్ట్రంలో సారా వ్యతిరేక ఉద్యమం, వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో పీఓడబ్ల్యూ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఝాన్సీ మాట్లాడుతూ మహిళా ఉద్యమకారులపై ఉపా వంటి చట్టాలను ఉపయోగించి నిర్బంధం చేయడం సరైంది కాదన్నారు. మణిపూర్‌లో మహిళలను నగ్నంగా ఊరేగించడం వంటి అనాగరిక చర్యలను ప్రభుత్వం నియంత్రించకపోవడం అత్యంత బాధాకరమన్నారు. పీఓడబ్ల్యూ గ్రేటర్ అధ్యక్షురాలు అనసూయ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ గౌరీ, కార్యదర్శి అందె మంగ, కావేరి, సంతోషా, పుష్ప, నవ్య, సుజాత, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం



బతుకమ్మ కుంటలో బడ్జెట్ ప్రతులను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందని సీపీఎం నగర కార్యవర్గ సభ్యుడు మహేందర్ అన్నారు. తెలంగాణకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం బతుకమ్మకుంటలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పట్ల వివక్ష ప్రదర్శించడం దారుణమన్నారు. దేశంలో అధిక ఆదాయాన్ని ఇస్తున్న రాష్ట్రానికి బడ్జెట్‌లో మొండిచేయి చూపడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాము, సుబ్బారావు, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

'పేదల సొమ్ము.. కార్పొరేట్ పాలు'



మాట్లాడుతున్న దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కేంద్ర ప్రభుత్వం పేదల సొమ్ము కార్పొరేట్ పాలు చేస్తోందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ విమర్శించారు. బుధవారం బాగ్ లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో దాసు సురేష్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలు పేదవాడి నడ్డి విరిచే విధంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లో నేటికీ బీసీల భాగస్వామ్యం 19.6 శాతంగానే ఉండగా లేబర్ ఫోర్స్ మాత్రం 44 శాతం ఉంటూ బీసీలను కూలీలుగా పరిగణిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణాలో కామారెడ్డి డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బీసీలకు అన్ని రంగాల్లో అవకాశాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండారు పద్మావతి, తాళ్లపాక భాగ్యలక్ష్మి, వీజీ ఆర్ నారగోని, శ్రీమాన్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గురువులకు సన్మానం

చిక్కడపల్లి: తెలంగాణ కళాజాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి సిటీ కల్చరల్‌హాల్‌లో సంగీత, నృత్య గురువులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి సంస్థ అధినేత ఎంకే రాము నిర్వహకులు సన్మానించారు. మొదట గురువందనం పేరిట చిన్నారులు సంగీత, నృత్య కార్యక్రమాలను నిర్వహించి ఆకట్టుకున్నారు. ఫౌండేషన్ అధ్యక్షుడు పద్మవెంకటేష్, రవికుమార్, స్వర కిన్నెర త్రినాథరావు, రామ్మూరావు తదితరులు పాల్గొన్నారు.

భారత్ దశ, దిశను మార్చే బడ్జెట్ ఇది



పటేల్‌నగర్ చౌరస్తాలో ప్రధాని చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు



ప్రధాని నరేంద్రమోదీకి పాలాభిషేకం చేస్తున్న డాక్టర్ ఎస్.గౌతంరావు, ఎ.సూర్యప్రకాష్ సింగ్

అంబర్‌పేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ లక్ష్యాన్ని నేరవేరుస్తుందని సెంట్రల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు గౌతమ్‌రావు అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ అభ్యున్నతికి దోహదపడుతుందన్నారు. బుధవారం పటేల్‌నగర్ చౌరస్తాలో ప్రధాని మోదీ చిత్రపటానికి నాయకులు పాలభిషేకం చేశారు. అనంతరం గౌతమ్‌రావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశానికి దశ, దిశను నిర్దేశిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్‌గౌడ్, డివిజనల్ అధ్యక్షులు నాగభూషణం చారి, నాయకులు శ్యామ్‌రాజ్, యశ్వంత్, ఎస్ఎస్ రెడ్డి, భిక్షపతి, నవీన్‌రెడ్డి, మహిలారం రాజు, కృష్ణముదిరాజు, యాదగిరి, వెంకటస్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

కాచిగూడ: పార్లమెంట్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశ ప్రజలందరూ ఆమోదించే విధంగా ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు అన్నారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్ ఆధ్వర్యంలో బుధవారం బర్కత్‌పుర చమన్ వద్ద ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశాన్ని అన్ని రంగాలలో మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఈ బడ్జెట్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, పార్టీ నేతలు సి.నందకిషోర్‌యాదవ్, శ్రీధర్, శ్యామ్‌రాజ్, రమేష్‌యాదవ్, సుభాష్ పటేల్ పాల్గొన్నారు.

అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం



అసెంబ్లీ వద్ద బలవంతంగా అరెస్టు చేస్తున్న పోలీసులు

ముషీరాబాద్: ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ సందర్భంగా విద్యార్థులకు, పోలీసులకు మధ్య వాగ్వావాదం, తోపులాట చోటు చేసుకుంది. పోలీసులు బలవంతంగా విద్యార్థి నాయకులను అరెస్టు చేసి కంచెన్‌బాగ్, బండ్లగూడ పోలీస్‌స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భువనగిరి మధు, పి.నాగరాజు మాట్లాడుతూ... బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలన్నారు. నీట్ బాధితులకు న్యాయం, నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యత రాష్ట్రానికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని యూనివర్సిటీలకు పర్మనెంట్ వీసీల నియామకం చేపట్టాలన్నారు. అన్ని రకాల పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా ఆందోళన చేయడానికి అసెంబ్లీ వద్దకు వస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయం అన్నారు. ముందే చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని భంగం చేయడం కోసం పోలీసులు సంగారెడ్డి జిల్లాలో అర్ధరాత్రి సురేష్, నర్సింహారెడ్డి, సందీప్‌లతో పాటు మొత్తం 12 మందిని ముందస్తుగా పటాన్‌చెరులో అరెస్టు చేశారు. హైదరాబాద్‌లో ఉపాధ్యక్షుడు సైదులును బుధవారం తెల్లవారుజామున ఇంటి వద్ద అరెస్టు చేసి అంబర్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో పెట్టారు.

ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం

మైనర్ చేతికి వాహనమిస్తే జైలుకే

- జూన్ 1 నుంచి అమలులోకి వచ్చిన నూతన ట్రాఫిక్ నిబంధనలు
- మద్యం మత్తులో వాహనం నడిపితే మూడేళ్ల జైలు
- అంబులెన్స్‌కు దారివ్వకపోతే రూ.10 వేల ఫైన్



డీడీ హెచ్‌ఆర్‌సీ ఆడిటోరియంలో కళాశాల విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రాంచందర్ నాయక్ (ఫైల్ ఫొటో)

నల్లకుంట: గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో ఏదో ఒక ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలో ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పిస్తూ ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేస్తూ గత నెల 1వ తేదీ నుంచే రాష్ట్ర ప్రభుత్వం నూతన ట్రాఫిక్ నిబంధనలు అమలు చేస్తోంది.

మైనర్ తప్పిదానికి తల్లిదండ్రులకు శిక్ష..

నూతన చట్టం ప్రకారం మైనర్లతో వాహనాలను నడిపిస్తే తల్లిదండ్రులు లేదా సంరక్షకులుగా ఎవరు ఉంటే వారికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తారు. గతంలో కేవలం రూ. వెయ్యి జరిమానా విధిస్తూ ప్రతి శుక్రవారం జువైనల్ కోర్టుకు హాజరయ్యేలా నిబంధన ఉండేది. అయితే జరిమానా ఒక్కటే కావడంతో తల్లిదండ్రులు నిర్లక్ష్యంగా మైనర్లకు వాహనాలు ఇచ్చి పరోక్షంగా అమాయకుల ప్రాణాలతో పాటు మైనర్ల ప్రాణాలకు ప్రమాదం వాటిల్లేందుకు కారకులవుతూ వచ్చారు.

◆ దీంతో జరిమానాలతో మైనర్లను నియంత్రించలేమన్న ఆలోచనతో నూతన చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మరింత కఠినతరం చేసింది. భారీగా జరిమానాతో పాటు జైలు శిక్షను కొత్త చట్టంలో చేర్చారు. ఈ క్రమంలో వాహన రిజిస్ట్రేషన్ కూడా రద్దు చేసేలా నిబంధన జోడించారు. ఈ చట్టం వల్ల మైనర్లు ర్యాష్ డ్రైవింగ్, సైలెన్సర్ లేకుండా వాహనాలను నడపడం వంటి ఘటనలు నియంత్రించ వచ్చునని రవాణా శాఖ అధికారులు, పోలీసులు అంటున్నారు.

చట్టం సవరిస్తూ ఉత్తర్వుల జారీ..

ప్రజల ప్రాణాలకు భద్రత కల్పించడమే లక్ష్యంగా రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనల్లోని పలు సెక్షన్లను కఠినంగా అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఇకపై నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానతో పాటు జైలు శిక్ష విధించేలా జీఓ.21 మార్చారు. చట్టంలోని సెక్షన్ 200ను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు గరిష్టంగా పదేళ్ల వరకూ జైలు శిక్షపడే అవకాశముంది. ఇది వాహనదారుల్లో తప్పక మార్పు తెస్తుందని రవాణా శాఖ, పోలీసులు అధికారులు భావిస్తున్నారు. గత చట్టంలో కంటే నూతన చట్టంలో నిబంధనలు కఠినంగా ఉన్నాయి. గతంలో జరిమానాలతో సరిపెట్టేవారు. ఇప్పుడు అదనంగా జైలు శిక్ష విధించేలా చట్టంలో మార్పు చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



రోడ్డు ప్రమాదాల నివారణలో ట్రాఫిక్ పోలీసులకు ప్రజలు సహకరించాలి. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే అసలు సమస్యే ఉండదు. నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందే. మద్యం సేవించి వాహనం నడపకుండా ఆల్టర్నేట్ చూసుకోవాలి. మైనర్లకు వాహనాలు అసలే ఇవ్వొద్దు. పిల్లల సరదా కోసం ఆలోచిస్తే వారితో పాటు బయట వారు ప్రమాదాల బారిన పడాల్సి వస్తుంది. ట్రాఫిక్ నిబంధనలపై విద్యాసంస్థల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. – రాంచందర్ నాయక్, టీటీఐ ఇన్‌స్పెక్టర్ బేగంపేట

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

చిక్కడపల్లి: ఆయా శాఖాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ బోనాల వేడుకల్లో భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని కార్పొరేటర్ పావని అన్నారు. జవహర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో బుధవారం జీహెచ్‌ఎంసీ, పోలీస్, వాటర్‌వర్క్స్, హార్టికల్చర్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలు ప్రశాంతంగా బోనాల ఉత్సవాలను జరుపుకునేలా సహకరించాలన్నారు. డివిజన్‌లోని అమ్మవారి దేవాలయాల వద్ద మట్టికుప్పలు, రోడ్లకు మరమ్మతులతో పాటు వీధిదీపాలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు. శుక్ర, శనివారాల్లో దేవాలయాల వద్ద లైట్లు, బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ మైత్రేయి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ వినయ్‌కుమార్, చిక్కడపల్లి, ముషీరాబాద్ ఎస్ఐలు కంకణాల శశిపాల్‌రెడ్డి, ప్రేమ్‌కుమార్, ఏఈ సలామ్, ఎస్ఎస్ గోవర్ధన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మధ్యతరగతికి ఆమోదయోగ్యమైన బడ్జెట్



ఫీవర్ చౌరస్తా వద్ద వాహనదారులకు మిఠాయిలు తినిపిస్తున్న బీజేపీ నాయకులు

నల్లకుంట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మధ్య తరగతి ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్. గౌతంరావు పేర్కొన్నారు. ప్రజామోద బడ్జెట్ ప్రవేశపెట్టారని నల్లకుంట కార్పొరేటర్ అమృత ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా వద్ద మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. దీనికి హాజరైన గౌతం రావు బాటసారులకు మిఠాయిలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఎంబీ. కిశోర్ కుమార్, కె. లక్ష్మణ్‌కుమార్, శ్యామ్‌రాజ్, ధర్మేందర్, మధుయాదవ్, వెంకటేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి మృతదేహం లభ్యం

కాచిగూడ: గుర్తుతెలియని వృద్ధుడు (80) మృతదేహం లభ్యమైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ ఆర్టీసీ బస్ స్టాండ్ సమీపంలో ఓ గుర్తుతెలియని వృద్ధుడు మరణించి ఉన్నాడు. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.